# జిజ్ఞాస లేని జన్మ

చివుకుల శ్రీరామశర్మ

మా వెంకయ్య పొలాన్ని సాగుచేసే యెద్దుతో [illegible] సంవత్సరాలనుండి కష్టపడి పనిచేస్తున్నది; చాల సాధువైన జంతువు. అదిచాలా అలసిపోయి నప్పుడు మాత్రమే మా వెంకయ్య వేపు జాలి పుట్టేటట్టు చూస్తుంది. ఆచూపులలోని అర్థాన్ని గ్రహించి వెంకయ్య దాన్ని నాగలినుంచి విడిపించి దగ్గరనేయున్న ఒకచిన్న రాయిమీద తను గూడా అలుపుతీర్చుకుంటూ కూనరాగాలు తీస్తాడు.

అప్పుడా యెద్దును దగ్గరనేయున్న చెరువుకు తీసికొనిపోయి నీళ్ళుతాగించే వాణ్ణి. నెమ్మదిగా తలయెత్తి, తననోట్లోంచి నీళ్ళల్లో పడి చిన్న చిన్న శబ్దాలు చేసే నీటిబొట్లను ఆప్యాయంగా చూసేది మేకలనూ, గొర్రెలను మేయటానికి వదిలేసి చెట్ల నీడల్లో పశులకాపరులు పాటలు పాడుతుంటారు. ఆమైదానాల్నీ, కొండల్నీ, పచ్చిక బయళ్ళనీ, ఆసరస్సులనూ చూసుకుంటూ చల్లగాలిని పీలుస్తూ గడిపిన ఆమధురమైన రోజులు మరపురావు ఎప్పటికీ! ...

ప్రకృతి రామణీయకముల కొంతసేపు చూసిన తర్వాత వెంకయ్య మామూలుగా తనఎద్దు దగ్గరకువచ్చి దాని నున్నటి వీపును ప్రేమగా తన చేత్తో రాచి నాగలి కడతాడు.

ఇంక వెంకయ్య సంగతి చెప్పాలంటే అతని వంటి మంచి వ్యవసాయదారుడు వేరేలేడనే చెప్పచ్చు. ఏపొలానికి ఏయెరువు వెయ్యాలో అతనికి తెలిసినట్లు ఇంకెవరికీ తెలియదు. మొదట్లో వెంకయ్యకు పొలం ఉండేదికాదు. వాళ్ళనాన్న చాలాబీదవాడు. చనిపొయ్యేటప్పుడు ఒకచిన్న పూరిపాక వదిలేసిపోయాడు. కాని వాని ప్రదహనసంస్కారాలకే ఆపూరిపాకను అమ్మవలసి వచ్చింది. వెంకయ్య [illegible] పనిచేసినా పాపం వెంకయ్యకు బీదస్థితి తప్పలేదు పదేళ్ళనుంచీ ఒకఆసామి దగ్గర పని చేస్తూ వెంకయ్య డబ్బుదాచి పెట్టి, ఒకచిన్న కోడెదూడను సంతలో కొన్నాడు. దాన్ని జాగ్రత్తగా పెంచి పెద్దదాన్నిచేసాడు. రెండెకరాల భూమి గూడా కొన్నాడు. తానూ, ఆ యెద్దూ పొద్దున్నే లేచి, పొలానికి వెళ్ళి, పగలంతా కష్టపడి పనిచేసి సాయంత్రానికి ఇంటికి రావటం మామూలైంది.

వెంకయ్య కొస్త కుదట పడ్డాడో లేదో, మతాల పేరిట రజాకార్లు చెలరేగి అనేక దుండగాలుచేయుటం మొదలు పెట్టారు. కాంగ్రెసు పార్టీకి చెందిన ఒక యువకుడు వెంకయ్యా, మిగతా భూ కాముందులూ ఉన్నచోటికి వచ్చి 'రజాకార్ల దుండగాల్ని మీరుసహిస్తారా' ? అని అడగటంతోటే ఎవ్వరూ కిక్కురు మనలేదు.

యువకుడు 'అయితే మీకా కష్టాలుండవులే' అన్నాడు. వెటకారంగా...

పాపం వెంకయ్యకు రజాకార్లెవరో, కాంగ్రెసు అంటే యేమిటో, ఏమీతెలియదు. అందుకని మౌనంలో తనపొలం, తనపశువు — వీటిని గురించి ఆలోచించాడు. యువకుడు. "మీరంతా కలసి మిమ్మల్ని రక్షించుకోటానికి ఒక సమితి యేర్పరుచుకోవాలి" అనిచెప్పి వెళ్ళిపోయాడు.

వెంకయ్య మనసులో తనపొలం వృథాగా పోనీయ గూడదని, తనయెద్దుకు మేత బాగుండాలనీ అనుకుంటూ అతడు చెప్పేమాటలను లక్ష్యపెట్టకుండా తనపొలానికి పోయి గున్నటం ప్రారంభించాడు. వెంకయ్య వద్దంటున్నా సమి

తిలో సభ్యుణ్ణిగా చేర్చారు. గ్రామస్థు లందరితో ఒక రోజు మీటింగులో, ఒకరోజు ఊరేగింపు లోను గడపవలసి వచ్చింది.

ఆ యువకుడు ఒక మీటింగులో "ఈ గ్రామంలో యున్నదంతా మనం సమానంగా పంచుకోవాలి" అని సూక్ష్మంలో మోక్షం తేల్చి చెప్పాడు.

వెంకయ్య "నాయెద్దు యెప్పటికీ నాదే. దాన్ని నేను చిన్నప్పటి నుంచీ పెంచాను" అని యింకా యేమో చెప్ప బోయాడు. ఇంతలో -

దగ్గరనున్న కొండల్లో తుపాకి మోతలు, అరుపులు విన్నందు వల్ల వెంకయ్య మొండి వాదనను ఎవ్వరూ వినలేదు. గుంపులో నున్న వారిలో కొందరు 'రజాకార్లు వస్తున్నారు. అదుగో రజాకార్లు వస్తున్నారు.' అన్నారు. వెంటనే జనమంతా పిచ్చిపట్టి నట్టు తుపాకిమోతలు అరుపులు వినబడ్డ చోటికి పరుగెత్తారు.

వెంకయ్య కిదంతా పాపం అర్థంకాక మీటింగుజరిగినచోటవంటరిగా నిలబడ్డాడు. మనుషులలో మార్పు వచ్చింది గాని గ్రామంలోను, ప్రకృతిలోను ఏమార్పు రాలేదు. బూజు పట్టిన దూలాలు నల్లని గోడలు, అదివరకు మాదిరే చెక్కు చెదరకుండా ఉన్నాయి, రావిచెట్టుఆకులు గాలికి గలగల మంటున్నవి. పేడ, పండి పోయిన ఆకులు ఎత్తు పల్లాలుగా ఉన్న రోడ్డుమీద పడియున్నయ్. కొళ్ళుతిరుగు తున్నవి తనయెద్దు దూరాన కనుచూపు మేరలో ఉంది. తన పశువును తీసుకొని వెంకయ్య పొలానికి వెళ్ళాడు.

తుపాకుల యుద్ధము రెండుగంటల సేపు జరిగింది. తర్వాత అంతా నిశ్శబ్దము. గ్రామస్తులంతా నెమ్మదిగా, చప్పుడు లేకుండా వెనక్కి తిరిగి పరుగెత్తు తున్నారు ఆ యువకుడు గ్రామనాయకులుకనపడ్డంలేదు. పొలంచివరనకాంగ్రెసు యువకుని శవము పడియున్నది. ఒంటినిండా కత్తిపోట్లు, తుపాకి గుండ్ల చిల్లులు ఉన్నయ్. వెంకయ్య అదివరకెప్పుడూ, తనపొలంలో అవిధంగా చచ్చిన మనిషిని చూడలేదు. అతని నెత్తురుతో తడసిన ధాన్యాన్నా తను తినటం! తనతండ్రి చనిపోయి నప్పుడు కూడా ఏడ్వని వెంకయ్య యిప్పుడు అప్రయత్నంగా ఏడ్చాడు.

రజాకార్ల నాయకుడు గ్రామానికి నిప్పంటించమని చెప్పగానే వాని సహచరులాపని చేసి కోళ్ళను, పశువులనూ ఎత్తుకొని వెళ్ళారు. ఇంతలో వెంకయ్య ఇంటికి తిరిగివచ్చాడు. తనవసారా సగం కాలియుంది. ఇల్లంతా కాలిపోనందుకు సంతోషించి, కాలిపోయిన భాగాన్ని బాగుచేశాడు.

ఇళ్ళు బాగుచేసి కొన్నతర్వాత గ్రామస్థులంతా మళ్ళా తుపాకులతో గురిచూడ్డం, రైఫిలుతో కాల్చటం మొదలైనవి చేయటం మొదలు పెట్టారు. తుపాకులతో కాల్చబడ్డ ఆనాయకుణ్ణి తలచు కొన్నకొద్దీ. వెంకయ్యకు గురిచూసి కాల్చటం మీద అసహ్యం పుట్టింది. తుపాకులతో కాల్చటం వెంకయ్య మానుకొన్నాడు.

మళ్ళీ, రజాకార్లదండు వచ్చింది. గ్రామస్థులంతా వారితో పోరాడటానికి వెళ్ళారు. ఈసారి గురిచూచి కాల్చటం నేర్చుకొన్నారు కాబట్టి పోరాటం తీవ్రంగానే యుంది. తుపాకి గుండ్లు హడావిడిగా అటు ఇటు పరుగెత్తు తున్నవి చీకటి పడేవరకు గ్రామస్థులు శక్తి కొద్దీ పోరాడారు. వెంకయ్య దగ్గరనే యున్న ఒక కొండ గుహలో దాకొన్నాడు. రజాకార్లు రాకుండా తమగ్రామాన్ని గ్రామస్థులు కాపాడు కొన్నారు. యుద్ధం అయి పోయిన తర్వాత గుహలోంచి బయటికి వచ్చి తన యెద్దుకోసం వెతకటం వెంకయ్య మొదలు పెట్టాడు. బాగాచీకటి పడ్డది. నక్కలకూతలు

వినపడు తున్నవి. నల్లమేఘాల్లోంచి చంద్రుడప్పుడప్పుడు తొంగిచూస్తున్నాడు. ఒకపొద దగ్గర ఒకశవం — ఒకపశువు శవం — కాదు ఒకయెద్దు శవాన్ని వెంకయ్య ఆ తొందరలో చూశాడు. దూరాన్నే తనురావటం చూసి సంతోషంతో కొంకరగా ఆడించే ఆ కొద్దతోకను గుర్తుపట్టాడు. వెంకయ్య యేడ్వాలని ప్రయత్నించాడు కాని యేడ్వలేకపోయాడు.

ఆరాత్రి వెంకయ్య కొక్క కునుకైన పట్టలేదు జీవితమే దుఃఖ మయంగా తోచింది. వేకువ జామునవే గ్రామస్థుల దగ్గరకు వెళ్ళి నా కో తుపాకీనిమ్మని అడిగాడు. అప్పుడే రజాకార్ల మూక వచ్చింది. గ్రామంలోని వాళ్ళంతా వాళ్ళనెదిరించటానికి పోయారు. వాళ్ళందరికన్నా ముందు ఈసారి వెంకయ్య పరుగెత్తాడు.

గ్రామస్థులంతా చెట్లచాటున, పొదలమాటున పెద్దరాళ్ళ వెనకాల దాక్కొని కాల్చటం మొదలు పెట్టారు. వెంకయ్య ఒకగోరీవెనకాల కూర్చొని, కాల్చటం ప్రారంభించాడు. వెంకయ్య తుపాకీకి విశ్రాంతిలేదు. తననాయకుని పగ, తనయెద్దుపగ తీర్చుకొంటు నద్దుగా వెత్తిగా మనుష్యులున్నా లేకపోయినా పేలుస్తున్నాడు.

కొంతసేపటికి వెంకయ్యకు 10 గజాలదూరంలో ఒకకొత్త మనుష్యుడు కనిపించాడు. తన గ్రామస్థుని వలెలేడు, గడ్డంపూర్తిగా పెరిగింది; కళ్ళు కోపాన్ని చాటుతున్నవి. అతడు తన శత్రువని వెంకయ్య ఊహించే లోపలనే ఆ నవీనుడు తుపాకీ పేల్చాడు. వెంకయ్య పడిపోయాడు.

సాయంకాలమైంది. యుద్ధం ముగిసింది. సూర్యుడప్పుడే విశ్రాంతి తీసికొంటు నట్టు పడమటి కొండల మీద విశ్రమింప బోతున్నాడు- పక్షులు కలకలమంటు తమ తమ గూళ్ళకు వెళ్లుతున్నయ్ గ్రామస్థులలో వెంకయ్య లేడు. అంతా వెతికారు, వెంకయ్యను పోలిన మొండెం ఒకగోరీ వెనకాలపడి ఉంది. ఆశవానికి తలలేకపోవటం వల్ల ఆశవం వెంకయ్యదే అని యెవ్వరూచెప్పలేరు,

'అబలమైన కాళ్ళు' విశాలమైన ఛాతీ, ఆపెద్దచేతులూ చూడండి, అది వెంకయ్యదే అయి ఉండవచ్చు, అనిచూడ్డానికి వచ్చిన వాళ్ళలో ఒకాయన అన్నాడు. కాలం మామూలుగానే జరుగుతోంది........

★

# అవి

★ బి. వి. ప్రసాదరావు ★

రోదోంతర గహ్వరాలలో
బ్రతుకలేక రోదించిన గొంతుకలవి
కాళరాత్రి చే జిక్కిన గొంతుకలవి
రాక్షసుని మేఘగర్జనలో సన్నగిలిన గొంతుకలవి
చల్లారిన మృతదేహపు గొంతుకలవి
రక్తారుణ దమననీతి నణగారిన గొంతుకలవి
నీతిరహిత ప్రజాప్రభుత్వం నులిమివేసిన గొంతుకలవి,